## క్లుప్తంగా

### గిరిబాబును కలసిన శంఖవరం గ్రామస్తులు



కిర్లంపూడిలో గిరిబాబును కలసిన శంఖవరం గ్రామస్తులు

**కిర్లంపూడి:** వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును శంఖవరం గ్రామస్తులు శుక్రవారం కలిశారు. కిర్లంపూడిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తుని:** విద్యుత్ లైన్ల నిర్వహణ, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని గొల్లపేట, దివాణం వీధి, బాడవతోట, వెంకటేశ్వర స్వామి ఆలయం, వడ్ల బంగారమ్మ వీధి, పాత బజారు, బెల్లపె వీధి, నారాయణరాజు గారి వీధి, ప్రకాశం రోడ్డు, ముస్లీం వీధి, చిన్నవీధి, పెద్దవీధి, కొబ్బరితోట, కొత్త సూరవరం, రామకృష్ణాకాలనీ, గవరి పేట, ఉప్పరగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

### గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

**ఏలేశ్వరం:** గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని సిరిపురం, పేరవరం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు శుక్రవారం ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే లోవరాజు, సర్పంచ్ పీతల నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

### వేద విద్యార్థులకు రూ.10,116 వితరణ

**తుని రూరల్:** కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి అలయన్స్‌క్లబ్ రూ.10,116 అందజేసినట్టు క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, కార్యదర్శి వీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం డిస్ట్రిక్ట్ గవర్నర్ దండెం పోలారావు, మహిళా గవర్నర్ అట్లూరి ఉషారాణి చేతులమీదుగా ఆశ్రమం పీఠాధిపతి సచిదానంద సరస్వతీ మహాస్వామి ఈ మొత్తాన్ని అందజేశారు. అనంతరం క్లబ్ సర్వసభ్య సమావేశం తునిలో నిర్వహించారు. అలయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని నిర్ణయించారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు, కోశాధికారి నూకయ్యశెట్టి, చాంబర్ అధ్యక్షుడు సకురు నాగేంద్ర నెహ్రూ, నెల్లిపూడి రాజబాబు, పరవాడ తాతబాబు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### నెలాఖరుకు యాంత్రీకరణ పనిముట్ల సరఫరా

**తుని రూరల్:** ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఈ నెలాఖరు నాటికి వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు రైతులకు అందజేయాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని తేటగుంట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన తుని, కోటనందూరు, తొండంగి మండలాల ఏఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.1.06 కోట్లు మంజూరయ్యాయని, అవసరమైన రైతులకు రాయితీపై యంత్రాలు అందజేయాలన్నారు. మండలాలు వారీగా వ్యవసాయ పరిస్థితులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఓలు బి.అశోక్ కుమార్, చంద్రశేఖర్, నరసింహం, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగసోమరాజు పాల్గొన్నారు.

### సూరంపాలెం ప్రాజెక్ట్ పరిశీలన

**గోకవరం:** గంగవరం మండలంలోని సూరంపాలెం ప్రాజెక్టును శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీటి ఎద్దడి నెలకొంది. రైతులు ఇబ్బందులు పడుతుండటంతో ఆయన స్వయంగా ప్రాజెక్టుని పరిశీలించి సూరంపాలెం రిజర్వాయర్‌కు నీటిని రప్పించే అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి సూరంపాలెం ప్రాజెక్టుకు సుమారు 18 కిలోమీటర్లు మాత్రమే దూరమని, రూ.4 కోట్లు వెచ్చిస్తే సూరంపాలెం ఆయకట్టు రైతాంగానికి ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, నాయకులు గాజింగం సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

# వనితకు వందనం




కాలం మారుతోంది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ప్రగతి పథంలో దూసుకుపోతున్నారు. ఆయా దగ్గర నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పురుషులకు దీటుగా సాధికారతను సాధిస్తున్నారు. కుటుంబంలో కీలక పాత్ర పోషిస్తూనే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మహిళలను మరింత ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.



ఉత్తరకంచిలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ప్రత్తిపాడు రూరల్:** ఆకాశంలో సగం ఆమె. మహిళ లేనిదే సృష్టే లేదు. అందుకనేమో ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందని పెద్దలు చెబుతారు. ప్రస్తుతం పురుషుడితో సమానంగా మహిళలు అన్నింటా రాణిస్తున్నా సమానత్వం విషయంలో వారికి చేదు అనుభవమే ఎదురవుతోంది. సమాజంలో మృగాళ్లను ఎదుర్కొంటూ ధైర్యంగా నిలబడుతున్నా.. అక్కడక్కడా జరుగుతున్న ఘటనలతో ఆమె అణిచివేతకు గురవుతోంది.

#### సమాన అవకాశాలు కల్పించాలి



పిల్లలను మంచి వ్యక్తిత్వం గల పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర అనిర్వచనీయం. విద్య, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక, క్రీడా, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. మరింతగా ఎదగాలంటే మహిళల దృక్పథం మారాలి. సవాళ్లను ఎదుర్కొంటూ మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలి.

– ఎం సూర్యప్రభ, తహసీల్దార్, ప్రత్తిపాడు

#### ధైర్యం, ఆత్మవిశ్వాసం అవసరం



స్త్రీలకు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం. మహిళలపై హింస, అణచివేత ధోరణి తగ్గాలి. అతివల అభివృద్ధే దేశాభివృద్ధి అని గ్రహించాలి. మహిళలు తలచుకుంటే ఆకాశామే హద్దుగా విజయాలు సొంతం చేసుకోగలరు. తమ శక్తిని నమ్ముకుంటే మహిళలు ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేస్తారు.

– ఎస్.సూర్యకాంతం, ఎస్సై, ప్రత్తిపాడు

#### ఆర్థిక స్వాతంత్య్రం ఉండాలి



సంకల్పం ఉంటే ఏ రంగాలోనైనా విజయం సాధించవచ్చు. ఆడపిల్లలకు ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్య్రం ఉండాలి. అది ఉన్నప్పుడు ఎంతటి సమస్యనైనా ఎదుర్కోగలుగుతారు. లక్ష్యసాధనకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తప్పకుండా ఉండాలి.

– ఎస్.వరలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ప్రత్తిపాడు

అతివలు మరింతగా ఎదగాలంటే సామాజిక దృక్పథం మారాలి. ప్రతిఒక్కరూ వనితలను గౌరవించాలి. ఆధునిక యుగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ప్రగతిపథం వైపు ముందుకు సాగుతున్న కొందరు మహిళలు అందరికీ ఆదర్శప్రాయులు.

## బాధితురాలికి బ్యాగు అందజేత

**అన్నవరం:** రైలులో బ్యాగు మర్చిపోయిన దిగిపోయిన బాధితురాలికి పోలీసులు ఆ బ్యాగును వెతికి అందజేశారు. వివరాల్లోకి వెళితే... మచిలీపట్నానికి చెందిన పంతాడి భవాని శుక్రవారం కాకినాడ వెళ్లేందుకు గాను మచిలీపట్నం–విశాఖపట్నం రైలు ఎక్కింది. ఆ రైలు సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ఆగినప్పుడు ఆమె బ్యాగ్ మర్చిపోయి దిగిపోయింది. ఆ బ్యాగ్‌లో మూడు సెల్‌ఫోన్లు, 10 గ్రాముల బంగారు పుస్తెలతాడు, ఇతర విలువైన వస్తువులు ఉండడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. కాకినాడ లైన్స్ ఇనస్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి కి ఫిర్యాదు చేయగా ఆయన తుని రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు అన్నవరం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథ్, సామర్లకోట ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అనిల్ అన్నవరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి తనిఖీలు ప్రారంభించారు. మచిలీపట్నంలో ప్రయాణికులు ఎక్కిన బోగీలో ఒక ప్రయాణికురాలు వద్ద ఆ బ్యాగును చూసి ఆమెను వివరాలు అడగ్గా ఆ బ్యాగు తమది కాదని ఎవరో మర్చిపోయారని తెలిపింది. దాంతో ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని చూడగా అందులో బాధితురాలు భవాని చెప్పినట్టుగా మూడు సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి ఉన్నాయి. ఆ బ్యాగును బాధితురాలికి అందజేసినట్లు అన్నవరం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథ్ తెలిపారు.




ప్రయాణికురాలు భవానీకి బ్యాగు, విలువైన సామగ్రి అందజేస్తున్న హెచ్‌సీ శ్యామ్ త్రినాథ్

### తాగునీరు అందించాలని వినతి

**ప్రత్తిపాడు:** ఎండలు మండుతున్నాయి. తాగడానికి నీళ్లు లేక గొంతెండిపోతోంది. గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీళ్లు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ధర్మవరం ఈబీసీ కాలనీ వాసులు తమ దాహార్తి తీర్చాలంటూ శుక్రవారం ప్రత్తిపాడులో ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథానికి వినతిపత్రం అందజేశారు. ధర్మవరం హైవేను ఆనుకొని 20 ఏళ్ల క్రితం కాలనీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలనీలో 40 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఉన్న చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. బిందెడు నీళ్ల కోసం ప్రమాదకరమైన జాతీయ రహదారిని దాటాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో చేతిపంపులకు మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడతామని ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం హామీ ఇచ్చారు.



ప్రత్తిపాడులో ఈఓపీఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న ధర్మవరం ఈబీసీ కాలనీవాసులు

## వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

**అన్నవరం:** రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్ కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 15 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

**అమ్మవార్లకు కుంకుమ పూజలు**

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## చేనేతలకు బడ్జెట్‌లో తీరని అన్యాయం

చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



**కోటనందూరు:** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు తీరని అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పలకా సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. చేనేత కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు కేటాయించి నిధులు సైతం విడుదల చేశారని, అయితే ఆ నిధులు కార్మికులకు అందలేదన్నారు. గతేడాది కన్నా 38 వేల కోట్ల అదనపు బడ్జెట్ ప్రవేశపెట్టి అందులో చేనేత రంగానికి కేవలం రూ.115 కోట్లు కేటాయించడంపై మండిపడ్డారు. గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం ప్రథకాన్ని కొనసాగిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత దానిని మరిచిపోయారని ఆరోపించారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలు, రిబేట్ పథకం కింద రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఇస్తానన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఊసే లేకుండా పోయిందన్నారు. అర్థాకలితో కాలం వెల్లదీస్తున్న చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

**ఏలేశ్వరం:** ఆర్టీసీ ఉద్యోగులపై అధికారుల వేధింపులు ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో శుక్రవారం ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు రమణరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలేశ్వరం, కాకినాడ డిపో మేనేజర్లు టీమ్ డ్రైవర్లను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేయడం, యాజమాన్యం ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోకపోవడం, ఉద్యోగులను రిలీవింగ్ పేరుతో ఇతర డిపోలకు పంపడం దారుణమన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను వేధించడం తగదన్నారు. అధికారుల వేధింపులతో ఉద్యోగులు అనారోగ్యానికి గురై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఉద్యోగులపై వేధింపులు ఆపి సస్పెండ్ చేసిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

## హిందూధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

**జగ్గంపేట:** హిందూధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాట్రావులపల్లిలో శుక్రవారం జరిగిన వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూవులు ఇతర మతాలను గౌరవిస్తూనే హిందూధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు వరసాల ప్రసాద్, రాయపాటి గోవిందు, దేశాల నరేష్ పాల్గొన్నారు.



కాట్రావులపల్లిలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

# మహిళలను గౌరవించడం మన విధి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలు రంగాల్లో రాణించిన అతివలకు సత్కారం

**ప్రత్తిపాడు:** అన్నింటా సగభాగమై.... గగన తలానికేగుతున్న మహిళలను గౌరవించడం మనవిధి అని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ నేడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కష్టాలకోర్చి కుటుంబాన్ని సాకిన పిల్లా శింగార లక్ష్మి, పాకలపాటి నాగమణిలను ఎంపీపీ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు బి.సుమిత్ర, మండల పరిషత్ ఏఓ శ్రీనివాస్, వీఎస్ఎస్ఎన్ మూర్తి, సురేష్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సమాజంలో మహిళల పాత్ర కీలకం**

**గండేపల్లి:** సమాజంలో మహిళల పాత్ర కీలకమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ మాట్లాడుతు తల్లిగా, సోదరిగా, భార్యగా ఎన్నో పాత్రాలు పోషిస్తూ మహిళలు సమాజానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ ప్రతి మహిళ అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ ఆర్. గంగాభవాని, సీడీపీఓ ఎం.పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శులు పీవీ శిరీష, షకీలా, శారద, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో 2కే రన్ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది

**మహిళలు మరింత చైతన్య వంతులు కావాలి**

**రౌతులపూడి:** ప్రస్తుత సమాజంలో మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని బీజేపీ కాకినాడ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమాన హక్కులతో పాటు స్వేచ్ఛ, స్వాతంత్య్రాలు అందించినపుడే మహిళలకు సరైన గౌరవం దక్కుతుందన్నారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గండేపల్లిలో మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**కోటనందూరు:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళా సాధికారితతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతీ ఆడపిల్ల చదువుకోవాలని, సమాజ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శుల(మహిళా పోలీసుల)ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**జగ్గంపేట:** అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట భగత్‌సింగ్ నగర్‌లో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకురాలు మల్లిక, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నా వారికి రక్షణ కరువైందన్నారు. నేటికి మహిళలపై హింస, దౌర్జన్యాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు దుర్గా ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు శ్రీమన్నారాయణ, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు గంటా బాలరాజు, మహిళా నాయకులు ఝాన్సీ శాంతి, రాజమ్మ, వీరలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి**

**శంఖవరం:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం శంఖవరంలో అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అన్నిరంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### దాడిశెట్టి రాజాను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**కోటనందూరు:** మాజీ మంత్రి, వైస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను ఆయన స్వగృహంలో శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా వెలగా వెంకటకృష్ణాజీని నియమించినందుకు గాను రాజాను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, సుర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

### తోట నరసింహంతోనే వైఎస్సార్ సీపీ బలోపేతం



తోట నరసింహాన్ని మర్యాదపూర్వకంగా కలిసిన కొప్పన శివనాథ్

**కిర్లంపూడి:** మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహంతోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్ అన్నారు. వీరవరంలోని తోట నరసింహం నివాసంలో శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని యువజన విభాగానికి సభ్యుల ఎంపికపై చర్చించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నక్కిరెడ్డి విష్ణు, పార్టీ జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేశ్‌రాజా, పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, శ్రీరామచంద్రమూర్తి, రామకుర్తి మూర్తి ఉన్నారు.

### సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

**తుని రూరల్:** మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం నుంచి ఈ నెల 18 వరకూ పీపుల్స్ ప్రైవేట్ పబ్లిక్ సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.సాయినేషన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వే విధివిధానాలపై గ్రామ సచివాలయాల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. తొమ్మిది అంశాలపై కటుంబ సమగ్ర సర్వే జరుగుతుందన్నారు. సాంఘిక, ఆర్థిక, వాణిజ్యేతర, పక్కా ఇళ్లు, కచ్చా ఇళ్లు, కుటుంబ సంపాదన, గృహాల్లో వినియోగించే టీవీ, ఫ్యాన్, వాణిజ్య వాహనాలు, తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. 20 శాతం పేదలను పదిశాతం ధనికులను జోడించి పేదరికం నుంచి శాశ్వతంగా దూరం చేయడం కోసమే ఈ సర్వే ప్రణాళిక ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.మరిడియ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పోలవరం కాలువ స్థల పరిశీలన

**గండేపల్లి:** గ్రామంలోని రంగంపేట వెళ్లే మార్గంలో గల పోలవరం కాలువ గట్టును ఆనుకుని ఉన్న స్థలాన్ని శుక్రవారం పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలవరం కాలువకు సంబంధించిన స్థలాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని ఏయే గ్రామాల్లో స్థలాలు ఉన్నాయో గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

### అభ్యుదయ రైతులకు శిక్షణ

**గండేపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, అభ్యుదయ రైతులకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పెద్దాపురం ఏరువాక కేంద్రం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయ కర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీకి చేరువలో.. అనే కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏఓ సద్గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమానంతో భార్యపై కత్తితో దాడి

**అన్నవరం:** అనుమానంతో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం అన్నవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... తుని మండలం డి.పోలవరానికి చెందిన లోవరాజుకు అన్నవరానికి చెందిన దిమిలి భవానితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భవాని అన్నవరం వచ్చేసింది. కాగా శుక్రవారం లోవరాజు అన్నవరంలోని భవాని వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. అనంతరం ఆమెపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన భవానిని తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు లోవరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలిక అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్

**గోకవరం:** ఇటీవల గోకవరంలో మైనర్‌బాలిక అపహరణ కేసులో నిందితుడి శుక్రవారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై వీఎన్వీ పవన్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 5న బాలిక కనబడడం లేదంటూ తల్లి ఫిర్యాదుపై కేసు నమోదైంది. దీనిపై విచారణ చేపట్టగా రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన రాయుడు శివ మైనర్‌బాలికను ప్రేమ, పెళ్లి అంటూ నమ్మించి అపహరించుకుపోయినట్లు తేలింది. నిందుతుడిని అదుపులోకి తీసుకుని పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడికి కోర్టు 15 రోజులు రిమాండ్ విధించింది.